ఉష్ణోగ్రత బుధవారం గరిష్ఠం : 28.0 కనిష్ఠం : 21.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అనంతపురం

జిల్లా వార్తలు

గురువారం 4 డిసెంబరు 2025



లోకల్‌కే ప్రాధాన్యం
- అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి కసరత్తు
- 80లో 51పోస్టులు మున్సిపాలిటీలకే..

7

స్పందన లేక..!

పోలీసుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

వరి కోతలు ప్రారంభం



వరి కోత కోస్తున్న యంత్రం

విడపనకల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో జీబీసీ (గుంతకల్లు బ్రాంచ్ కెనాల్) కింద సాగు చేసిన వరి పంట కోతలు ప్రారంభమయ్యాయి. కరకముక్కల, పాల్తూరు, హావళిగి, ఆర్ కొట్టాల, అంచనహాలు, వేల్పుమడుగు, వి. కొత్తకోట గ్రామాల్లో వరి కోతలు ప్రారంభించారు. కొంత మంది రైతులు కూలీల చేత వరి కోయిస్తుంటే, మరి కొంత మంది రైతులు యంత్రాల ద్వారా చేయిస్తున్నారు. సోన క్వింటా వడ్ల ధర రూ.2300 నుంచి 2400 ఉందని రైతులు చెబుతున్నారు. లావు(బొరుగుల) వడ్లు సోనా కంటే వంద రెండొందలు తక్కువగా ధర పలుకుతున్నాయని వారు పేర్కొంటున్నారు. కూలీలతో వరి కోతకు ఎకరానికి రూ.10వేలకు తీసుకుంటారు. యంత్రాలతో రూ.2 వేలు తీసుకుంటున్నారని పలువురు రైతులు చెబుతున్నారు.

మీ మొబైల్.. మీ ఇంటికే..

- కొత్త సేవా కార్యక్రమానికి నేడు శ్రీకారం



అనంతపురం క్రైం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజలకు వినూత్న రీతిలో సేవలు అందించేందుకు ఎస్పీ జగదీష్ నాంది పలికారు. 'మీ మొబైల్- మీ ఇంటికి' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించనున్నారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లకు సంబంధించి చాట్‌బాట్ లేదా సీఈఐఆర్ ద్వారా ఫిర్యాదు స్వీకరించి, రికవరీ చేసిన వాటిని నేరుగా యజమానుల ఇళ్లకు వెళ్లి అందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యం. సాంకేతిక పరిజ్ఞానం, సైబర్ ట్రాకింగ్ పద్ధతుల సాయంతో పోలీసు బృందాలు గుర్తించిన మొబైల్ ఫోన్లను సంబంధిత యజమానులకు పారదర్శకంగా, వేగంగా తిరిగి అందజేయనున్నారు.

జై హనుమాన్

- వైభవంగా హనుమద్ వ్రతం



హనుమద్ వ్రతాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

గుంతకల్లు, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): హనుమద్దీక్షల్లో చివరి కార్యక్రమమైన హనుమద్ వ్రతాన్ని కసాపురం దేవస్థానంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. హనుమాన్ మాలధారులు మంగళవారం ఇరుముడులతో కసాపురం ఆలయానికి చేరిన సంగతి విదితమే. కసాపురం దక్షిణ గోపురం ఎదుట భారీ వేదికను ఏర్పాటు చేసిన ఆలయ అధికారులు బుధవారం ఉదయం హనుమద్వ్రతాన్ని చేపట్టారు. హనుమాన్ ఉత్సవ విగ్రహాన్ని అలంకరించిన అర్చకులు, వేద పండితులు హనుమాన్ మాలాధారుల సమక్షంలో వ్రతాన్ని నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన సోదరులు నారాయణ స్వామి, శ్రీనివాసులు వ్రతంలో పాల్గొని స్వామివారి కంకణాలను ధరించారు. వ్రతం పూర్తయిన తర్వాత హనుమాన్ మాలధారులు మాలలను విసర్జించారు. సాయంత్రం ఆలయంలో స్వామివారి ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయరాజు, ఏఈఓ ఓంకారం వెంకటేశులు, ధర్మకర్త కే సుగణమ్మ, ప్రధానార్చకుడు రాఘవాచారి, వేద పండితులు పాల్గొన్నారు.

అర్జీలను వేగంగా పరిష్కరించాలి

- నిర్లక్ష్యం చూపే అధికారులపై చర్యలు
- పీజీఆర్ఎస్‌పై సమీక్షలో మంత్రి పయ్యావుల కేశవ్



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల

అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను మరింత వేగంగా పరిష్కరించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)పై కలెక్టర్ ఆనంద్‌తో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. పీజీఆర్ఎస్‌లో తీసుకుంటున్న చర్యలు, వచ్చిన అర్జీలు, పరిష్కరించిన వాటి వివరాలను కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ని అర్జీలు వచ్చాయి, ఎన్ని పరిష్కరించారు, ఎన్ని పెండింగ్ ఉన్నాయనే అంశాలపై ఆరా తీశారు. అనంతరం మంత్రి ఫోన్ ద్వారా పలువురు అర్జీదారులతో మాట్లాడారు. మీ అర్జీకి సరైన పరిష్కారం చూపారా..? మీరు సంతృప్తిగా ఉన్నారా అంటూ ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అర్జీలను సరైన విధంగా పరిష్కరించని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అర్జీదారులకు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో మలోల, ఆర్డీవో కేశవనాయుడు, కేఆర్సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, డీఎస్పీ మహబూబ్‌బాషా, హౌసింగ్ పీడీ శైలజ, డ్వామా పీడీ సలీమ్‌బాషా తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు పీజీఆర్ఎస్‌కు 50వేలకు పైగా అర్జీలు వచ్చాయని, అందులో 35వేల దాకా పరిష్కరించామని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ వ్యవస్థలో ఇంకా అభివృద్ధి చేయాల్సింది చాలా ఉందని అన్నారు. గ్రీవెన్స్ పరిష్కరించాలని సీఎం ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.

పంచాయతీల్లో లూటీ..!

- కంబదూరు మండలంలోని ఓ గ్రామ పంచాయతీలో గతంలో ఆర్డీటీ మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసింది. ఆ ప్లాంట్‌ను తాజాగా ఏర్పాటు చేసినట్లు రూ.13 లక్షలు స్వాహా చేశారు.
- మరో పంచాయతీలో ఆగస్టులోనే 20 సార్లు పంచాయతీ మోటారుకు రిపేరీ చేయించినట్లు చూపి, రూ.2లక్షలు కాజేశారు.
- ఇంకో పంచాయతీలో వీధి లైట్లు, మురుగు కాలువ శుభ్రం చేసినట్లు చూపి.. రూ.3 లక్షల వరకు జేబుల్లోకి వేసుకున్నారు. అదే పంచాయతీలో ప్రతి మూడు నెలలకోసారి ఏదో ఒక పని చేసినట్లు ఎంబుక్కుల్లో రికార్డు చేసి, నిధులు కొల్లగొట్టారు.
- ఇంకో పంచాయతీలో అక్రమార్కులు ఓ అడుగు ముందుకేశారు. పనులే చేయకపోయినా.. పైపులైన్ ఏర్పాటు చేసినట్లు ఏకంగా రూ.5 లక్షల వరకు నిధులను డ్రా చేశారని తెలిసింది.
- బ్లీచింగ్ పౌడర్ చల్లామని ఓ పంచాయతీలో ఏకంగా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు స్వాహా చేశారు.

త్వరలో ముగియనున్న సర్పంచ్‌ల పదవీకాలం

అధికారులతో కుమ్మక్కై, యథేచ్ఛగా అక్రమాలు

నిధులను స్వాహాచేస్తున్న వైనం

పనులు చేయకుండానే బిల్లులు





కళ్యాణదుర్గం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో బరితెగించారు. సర్పంచ్‌ల పదవీకాలం త్వరలో ముగియనుండడంతో అందిన కాడికి దోచుకోవడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కుమ్మక్కై, పనులే చేయకుండా బిల్లులు చేసుకుంటున్నారు. కంబదూరు మండలంలో అడ్డగోలుగా ప్రజాధనం లూటీ చేస్తున్నారు. మండలంలోని ఓ పంచాయతీలో ఆర్డీటీ సహకారంతో గతంలో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్‌కు ఇప్పుడు అక్రమంగా బిల్లు చేసుకున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కొన్ని పనుల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కూడా కుమ్మక్కవుతున్నారు. వీటిపై జిల్లా అధికారులు ఫిర్యాదులు వెళ్లడంతో ఆయన ఇటీవల కంబదూరు (మిగతా 7లో...)

అమ్మ.. అశ్వత్థరెడ్డీ..

- వెలుగులోకి కంబదూరు కార్యదర్శి లీలలు
- విధుల్లో నిర్లక్ష్యమే కాదు.. అక్రమాలు సైతం..
- భార్య ఖాతాకు నిధుల మళ్లింపు
- రికార్డులు ఇవ్వకుండా డ్రామాలు
- డీపీఓకి ఫిర్యాదు చేయనున్న ప్రస్తుత కార్యదర్శి

7

రేపే మెగా పీటీఎం



బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్‌లో విద్యార్థి తల్లిని పీటీఎంకు ఆహ్వానిస్తున్న టీచర్లు

అనంతపురం విద్య, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) వేడుకలను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్ బాబు తెలిపారు. బుధవారం ఆయన మెగా పీటీఎం వివరాలను వెల్లడించారు. గతంలో అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో పీటీఎం నిర్వహించామని పేర్కొన్నారు. ఈసారి ప్రభుత్వ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న పాఠశాలల్లో మాత్రమే పీటీఎం వేడుకల నిర్వహణకు ఆదేశాలు వచ్చాయని అన్నారు. ఆ మేరకు జిల్లా విద్యాశాఖ పరిధిలో 1724 పాఠశాలల్లో ఈ వేడుకలు నిర్వహిస్తామని వివరించారు. సుమారు రెండు లక్షల మంది విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొంటారని అన్నారు. వేడుకలను పండుగలా నిర్వహించాలని ప్రతి పాఠశాలకు మార్గదర్శకాలు పంపించామని తెలిపారు. వేడుకలకు ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులతోపాటు దాతలు, పూర్వవిద్యార్థులను ఆహ్వానిస్తామని తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పేరెంట్స్ డే వేడుకల అనంతరం అంద రూ కలిసి పాఠశాలలో సహపంక్తి భోజనం చేయాల్సి ఉంటుందన్నారు. పాఠశాలలో వసతులు, ల్యాబ్‌లు, స్పోర్ట్స్, ప్రభుత్వం నుంచి అందుతున్న వివిధ రకాల పథకాలు, ఆదరణ, సాయం తదితర వాటి గురించి తల్లిదండ్రులకు తెలియజేయాల్సి ఉంటుందన్నారు. అలాగే పిల్లల సామర్థ్యాలు, ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చి చర్చించాలని తెలిపారు.

ఇసుక ధరలకు రెక్కలు..!

- తుఫాను ప్రభావంతో చిత్రావతి, పెన్నానదుల్లో నీరు
- ఇసుక తవ్వకాలకు బ్రేక్
- కొరతతో అదనపు బాదుడు
- నిర్మాణ రంగంపై భారం



గరిశనపల్లి వద్ద చిత్రావతి నది నీటిలోనే ఇసుక తవ్వకాలు

పుట్టపర్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తుఫాన్ల ప్రభావంతో జిల్లాలో ఇసుక ధరలకు రెక్కలు వచ్చాయి. తుఫాన్ వర్షాలకు వంకలు, నదుల్లో నీరు చేరింది. ఈక్రమంలో ఇసుక తవ్వకాలకు బ్రేక్ పడింది. దీంతో ఉన్న ఇసుకకు డిమాండ్ పెరగడంతో ధర కూడా పెరిగిపోయింది. జిల్లాలో పలు నదులు, వంకలు, వాగులు ఉన్నా ప్రధానంగా చిత్రావతి, పెన్నా నదుల నుంచే ఇసుక ఎక్కువగా తరలిస్తారు. చిత్రావతి నదిలో కర్ణాటక సరిహద్దు నుంచి కడప జిల్లాలోకి ప్రవేశించేదాకా నీరు ఉంది. ఈ నదిలో నాణ్యమైన ఇసుక దొరుకుతుండటంతో దీనికి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. నదిలో నీరు ఉండటంతో అంతంతమాత్రంగా దొరికే ఇసుకకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ఎలాంటి అనుమతులు లేకుండానే కొందరు అక్రమంగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

నదుల్లో నీటి నిల్వ

గత నెలలో కురిసిన వర్షాలకు జిల్లాలోని చిత్రావతి, కుషావతి, సోమావతి, సీజీ, పెడబల్లి ప్రాజెక్టులతోపాటు వాగులు, వంకల్లో నీరు ఉంది. ఈ నేపథ్యంలో నెల రోజుల నుంచి ఇసుక తవ్వకాలకు బ్రేక్ పడింది. దీంతో ఇసుక కొరత ఏర్పడింది. ఇదే అదనుగా ధరల పెంచేశారు. నదుల్లో నీరు పూర్తిగా తగ్గే సమయానికి ఇసుక ధర మరింత పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో గనులు, జలవనరుల శాఖ అధికారులు చిత్రావతి, పెన్నా (మిగతా 7వ పేజీలో..)

పత్తి కొనుగోలు ప్రారంభం

- నాణ్యతాలోపంతో తిరస్కరణ
- గుత్తిలో రైతుల ఆందోళన



పత్తిని గోదాములో దింపుతున్న హమాలీలు, రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపి ఆందోళన చేస్తున్న రైతులు

గుత్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డులో సీసీఐ ఆధ్వర్యంలో బుధవారం పత్తి కొనుగోలును ప్రారంభించారు. ఈ సందర్భంగా పేర్లు నమోదు చేసుకున్న 14 మంది రైతులు స్థానిక మార్కెట్ యార్డుకు పత్తిని తీసుకువచ్చారు. ఈ మేరకు అధికారులు తేమ శాతం, నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేపట్టారు. అందులో ఏడుగురు రైతులకు సంబంధించిన పత్తి నాణ్యత లేకపోవడంతో తిరస్కరించారు. దీంతో పెద్దవడుగూరు మండలం మల్లేనిపల్లి, మందర్లపల్లి తదితర గ్రామాల రైతులు గుత్తి, పత్తికొండ రహదారిలోని రోడ్డుకు పత్తి వాహనాలను అడ్డం పెట్టి ఆందోళన చేపట్టారు. తమ పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకుని ఆందోళనకారులను నచ్చచెప్పి పత్తి వాహనాలను మార్కెట్ యార్డులోకి తరలించారు. మార్కెటింగ్‌శాఖ డీడీఎం లావణ్య, ఏడీ రాఘవేంద్రకుమార్, మార్కెట్ యార్డు చైర్మన్ సూర్యప్రతాప్, అధికారులతో ఏఎస్ఐ రాజా చర్చలు జరిపారు. అనంతరం డీడీఎం సీసీఐ అధికారులతో మాట్లాడారు. రైతులు మాట్లాడుతూ.. తాము పత్తిని తెచ్చేందుకు వాహనాలకు రూ.30వేలు ఖర్చుపెట్టామని, ఇప్పుడు కొనుగోలు చేయకపోతే అన్ని విధాలుగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులతో చర్చించి పత్తికొనుగోలు చేస్తామని స్థానిక అధికారులు హామీ ఇచ్చారు.

నెట్టికంటి సన్నిధిలో హంపి పీఠాధిపతి

7

డ్రా దిశగా ఆంధ్ర, కర్ణాటక మ్యాచ్

అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతున్నారు

- విభిన్న ప్రతిభావంతులకు డీఎల్ఎస్ఏ క్యాదర్శి అభినందన
- ఘనంగా అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని జిల్లా న్యాయ సేవాసదన్ కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎస్ఎస్‌బీఎన్ రూసాహాలులో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. విభిన్నప్రతిభావంతులు ఇతరులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అన్ని రకాలుగా వారికి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అండగా నిలుస్తోందన్నారు. అంధ మహిళల మొదటి టీ20 క్రికెట్ ప్రపంచకప్‌ను గెలిచిన జట్టులో ఉమ్మడి జిల్లా వాసి దీపికా ఉండడం శుభపరిణామం అన్నారు. అనంతరం క్రీడా పోటీలలో విజేతలకు బహుమతులు, దివ్యాంగ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్వో మలోలా, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ అర్చన, డీఆర్‌డీఏ పీడీ శైలజ, ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి, మెప్మా పీడీ విశ్వజ్యోతి, ఆర్డీటీ డైరెక్టర్ రఫీ, డీఎస్పీ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి బృందావనం ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన రాఘవేంద్రస్వామి బృందావనం, మాట్లాడుతున్న మంత్రాలయ పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు

కళ్యాణదుర్గంరూరల్, డిసెంబరు 3(ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని దొడగట్టలో రాఘవేంద్ర స్వామి బృందావనాన్ని మంత్రాలయం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రతిష్ఠించారు. బృందావనం ప్రతిష్ఠ కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో దేవాలయ నిర్మాణ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

'తోపు'వి కోతలే తప్ప.. చేతలుండవు

- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత
- తోపుదుర్తిలో సబ్‌స్టేషన్, సీసీ రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే



విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, నాయకులు

అనంతపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తాను తోపునని చెప్పుకునే మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డివి మాటల్లో కోతలు తప్పా... చేతల్లో అభివృద్ధి ఎక్కడా చూపించలేని దద్దమ్మ అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్, సీసీ రోడ్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తోపుదుర్తి గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ లేక గత కొన్ని సంవత్సరాలుగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో ఇక్కడ రెండు చెరువులు నిండాయని తెలిపారు. పంటలు సాగు చేయాలంటే విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉండేవని గుర్తు చేశారు. ఈ సమస్యలు అధిగమించేందుకు విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయించామన్నారు. గత ప్రభుత్వంలో ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్న ఓ దద్దమ్మ వీటిని పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. ప్రకాష్‌రెడ్డి ఎక్కడ చూసినా కమీషన్ల కక్కుర్తితో టీడీపీ హయాంలో ప్రారంభించిన ఏ ఒక్క పనిని ముందుకు సాగనివ్వలేదన్నారు. ఆయన సొంత గ్రామంలో కనీసం విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయించుకోలేని అసమర్థుడు.. ఆ సైకో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అంటూ నిప్పులు చెరిగారు. విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం ఆగిపోయి పూర్తిగా రద్దు చేస్తారన్న క్రమంలో తాను చొరవ తీసుకొని కాంట్రాక్టర్‌తో మాట్లాడి పాత ధరలకే నిర్మాణం చేపట్టామన్నారు. నిర్ణీత కాలంలోనే పూర్తి చేశామని, ప్రారంభోత్సవం కాస్త ఆలస్యమైందన్నారు. ఈ సబ్ స్టేషన్‌తో తోపుదుర్తి, వేపచెర్ల, పాలచెర్ల గ్రామాల్లోని సుమారు రెండు వేల మంది ప్రజలు, రైతులకు ఉపయోగం ఉంటుందన్నారు. ఎన్నికల ముందు మాత్రమే తాను రాజకీయాల గురించి మాట్లాడతానని, ఇప్పుడు ఓట్లు వేసినా, వేయకపోయినా అందరూ తన వారే అన్నారు. గతంలో ఇక్కడున్న తోపు ఏదో చేస్తారన్న ఉద్దేశంతో గెలిపిస్తే కనీసం సొంత గ్రామానికి రోడ్డు వేయించలేకపోయారని ఎద్దేవా చేశారు. ఇళ్ల నిర్మాణాల పేరుతో రూ.80 కోట్లు దోపిడీ చేశారని ఆరోపించారు. సొంత గ్రామానికి రోడ్డు వేసుకోలేక అనంతపురం, తగరకుంట రోడ్డులో వెళ్లే చాలామంది ఐదేళ్లపాటు నరకం చూశారన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో గతంలో పార్టీని చూశారని.. ఇప్పుడు ఆ పరిస్థితి ఉండకూడదన్నారు. గ్రామంలో మారెమ్మ ఆలయ నిర్మాణంతో పాటు పలు పనుల గురించి తన దృష్టికి తీసుకొచ్చారని... త్వరలోనే చేపడతామని ఎమ్మెల్యే.. గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

నెట్టికంటి సన్నిధిలో హంపి పీఠాధిపతి



హారతి తీసుకుంటున్న విద్యారణ్య భారతిస్వామి

గుంతకల్లుటౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసాపురంలో నెట్టికంటి ఆంజనేయస్వామిని బుధవారం హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతిస్వామి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వామీజీకి స్వాగతం పలికారు. ప్రతి సంవత్సరం జరిగే హనుమద్ వ్రతం, దత్తజయంతి ఉత్సవాల్లో స్వామీజీ పాల్గొంటారని ఆలయ అధికారులు తెలిపారు. అనంతరం విద్యారణ్య స్వామిజీ ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులకు ఆశీర్వాదం అందించారు. కార్యక్రమంలో బెల్దాణ స్వాములు రామనాథ్ శాస్త్రి, వేణుగోపాలశాస్త్రి, శివశంకర శాస్త్రి, స్వామిజీ శిష్య బృందం మంజుల వెంకటేష్, ప్రదీప్‌ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'రైతన్నా.. మీకోసం '

అనంతపురం అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పంచసూత్రాలతో లాభసాటి వ్యవసాయం విధానాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతన్నా.. మీ కోసం కార్యక్రమం బుధవారం ముగిసింది. గతనెల 24 నుంచి రైతన్నా.. మీకోసం కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. మంగళవారం నాటికి క్షేత్ర స్థాయిలో ప్రచారం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో స్థానిక రైతులతో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది వర్క్‌షాప్‌ను నిర్వహించారు. అలాగే పలు మండలాల్లో ముగింపు సమావేశాలు నిర్వహించారు. డి. హీరేహాళ్ మండలం మురిడిలో నిర్వహించిన ముగింపు సమావేశానికి ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు హాజరయ్యారు. రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరు మండలం సనప రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే పరిటాల సునీత, శింగనమల మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీలు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం చేస్తున్న కార్యక్రమాలతోపాటు భవిష్యత్‌లో చేపట్టే పనులపై రైతులకు తెలియజేశారు.

యాక్షన్ ప్లాన్ తయారీ

జిల్లాలోని రైతు సేవా కేంద్రాల వారిగా ఈ ఏడాది రబీ, వచ్చే ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను తయారు చేశారు. మండలాల వారిగా యాక్షన్‌ప్లాన్‌ను జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి పంపనున్నారు. మండలాల వారిగా వచ్చిన యాక్షన్ ప్లాన్‌ను క్రోడీకరించి, జిల్లాస్థాయి యాక్షన్ ప్లాన్‌ను వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు పంపనున్నారు.

పెన్షనర్లు డీఎల్‌సీ సమర్పించాలి

ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య



రమణయ్యను సన్మానిస్తున్న పెన్షనర్లు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లు ప్రతి ఏడాది జనవరి 1 నుంచి ఫిబ్రవరి నెలాఖరులోపు డీఎల్‌సీ(డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల)ను సమర్పించాలని ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య పేర్కొన్నారు. అలాకాకుండా ముందుగా ఏ నెలలో సమర్పించినా ఆ సర్టిఫికెట్లు ఆమోదించబడవన్నారు. ఈ మేరకు బుధవారం ఎన్జీఓ హోంలో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్ ఆధ్వర్యంలో పెన్షనర్లకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానిక ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య మాట్లాడుతూ పెన్షనర్లు స్థానికంగా ఉన్నట్లయితే ఎస్‌టీఓ కార్యాలయాల్లోగానీ, మీసేవా కేంద్రాల్లోగానీ, పెన్షనర్ల సంఘాలు ఏర్పాటు చేసిన కేంద్రాల్లో తమ డీఎల్‌సీ సమర్పించాలన్నారు. అదే విధంగా విదేశాల్లో ఉన్న పెన్షనర్లు తమ డీఎల్‌సీలను అక్కడున్న ఎంబసీ కార్యాలయంలో సర్టిఫై చేయించుకొని ఎస్‌టీఓకు వీడియో కాల్ ద్వారా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి శీలా జయరామప్ప, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్, ఎస్‌టీఓ లక్ష్మి, అనంతయ్య, సీనియర్ అకౌంటెంట్ మసూద్ వలిలతో పాటు పెన్షనర్లు పాల్గొన్నారు.

రేపు ఎన్నికలు

అనంతపురం అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని 55 ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలకు ఈనెల 5న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత ఈనెల 12న రెండో విడతలో 29 ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఒక్కో సహకార సంఘంలో ఏడు డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఏకగ్రీవం కాకుండా ఎన్నిక అనివార్యమైతే చేతులు ఎత్తే పద్ధతిలో ఎన్నికలు నిర్వహించనున్నారు. వెటర్నరీ డాక్టర్లను ఎన్నికల అధికారులు గా నియమించారు. తొలి విడతలో ఎన్నికల నిర్వహణకు పశుసంవర్థక శాఖ యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఉమ్మడి జిల్లాలో 215 ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలున్నాయి. 131 సంఘాలకు ఇదివరకే ఎన్నికలు జరిగాయి. మిగిలిన 84 సంఘాలకు ఎన్నికలు పూర్తైన తర్వాత జిల్లా సంఘానికి ఎన్నికలు నిర్వహించనున్నారు.


నేడు డీడీఓ కార్యాలయాల ప్రారంభం

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) జిల్లాలోని మూడు డీడీఓ (డివిజన్ డెవలప్‌మెంట్ అధికారి) కార్యాలయాలు గురువారం ఉదయం 11 గంటలకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. అందుకు అనుగుణంగా సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. అనంతపురం రూరల్ పంచాయతీలోని సచివాలయం -2 భవనంలో డీడీఓ కార్యాలయం ఏర్పాటు చేశారు. డీడీఓ నాగశివలీల ప్రారంభోత్సవానికి సంబంధించి గత 3 రోజులుగా బిజీబిజీ ఉన్నారు. గుంతకల్లు డివిజన్‌కు సంబంధించి డీడీఓ విజయలక్ష్మి తగిన చర్యలు చేపట్టారు. కళ్యాణదుర్గం డివిజన్‌కు సంబంధించి డీడీఓ నాగేశ్వరశాస్త్రి ఏర్పాట్లు పూర్తి చేశారు.


సీనియారిటీ జాబితా సిద్ధం చేయండి

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ-వార్డు సచివాలయ సిబ్బందికి సంబంధించిన సీనియారిటీ జాబితా సిద్ధం చేయాలని గ్రామ - వార్డు సచివాలయాల డైరెక్టర్ శివప్రసాద్ బుధవారం షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 9 లోపు సీనియార్టీ జాబితా తయారు చేయాలన్నారు. 10న జాబితాను ప్రచురించాలన్నారు. దీనిపై అభ్యంతరాలు 11 నుంచి 23వ తేదీ వరకు స్వీరించాలన్నారు. తుది జాబితాను ఈ నెల 30న ప్రకటించాలని పేర్కొన్నారు.

డ్రా దిశగా ఆంధ్ర, కర్ణాటక మ్యాచ్



సిద్ధూ కార్తీక్‌రెడ్డి



అక్షత్ ప్రభాకర్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, ఆంధ్ర జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్ డ్రా దిశగా సాగుతోంది. కూచ్ బెహర్ ట్రోఫీ అండర్-19లో భాగంగా స్థానిక రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో బుధవారం ఆంధ్ర, కర్ణాటక జట్ల మధ్య మ్యాచ్ మూడోరోజు కొనసాగింది. ఓవర్‌నైట్ స్కోర్ 176-5తో మూడో రోజు ఆట ప్రారంభించిన కర్ణాటక జట్టు 148.1 ఓవర్లలో 392పరుగులకు ఆలౌట్ అయ్యింది. కర్ణాటక బ్యాటర్ అక్షత్ ప్రభాకర్ సెంచరీతో (112), సిద్ధార్థ అఖిల్ 83, ధ్యాన్ హిరేమత్ 47 పరుగులతో రాణించారు. ఆంధ్ర బౌలర్ సిద్ధు కార్తీక్‌రెడ్డి 5వికెట్లు పడగొట్టాడు. అనంతరం 22 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆంధ్ర 18.1ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి 36పరుగులు చేసింది. బ్యాటర్ కేహెచ్ వీరారెడ్డి 22పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నాడు.

ఇసుక ధరలకు రెక్కలు..!

(5వ పేజీ తరువాయి)

నదుల్లో ఇసుక రీచ్‌లు గుర్తించారు. గతంలో ముదిగుబ్బ మండలం ఉప్పలపాడు, పీసీరేవు, తాడిమర్రి మండలం సీసీరేవులో ఇసుక తవ్వకాలు జరిగేవి. అయితే ప్రస్తుతం అక్కడ ఇసుక తవ్వకాల టెండర్లలో ఆధిపత్య పోరు ఉండటంతో పలువురు కాంట్రాక్టర్లు ఎవరికివారుగా చిత్రావతి నదిలో నీరు లేని చోట తవ్వకాలు చేపట్టి ఇసుక తరలిస్తున్నారు. చిత్రావతి నదిలో ఉప్పలపాడు, పీసీ, సీసీరేవు, దంపెట్ల, గరిశనపల్లి, ఇందుకూరు, డి.చెర్లోపల్లి, పెద్దకోట్ల, ధర్మవరం వద్ద పోతులనాగేపల్లి, పుట్టపర్తి, చిలమత్తూరు, గోరంట్ల ప్రాంతాల నుంచి ఇసుకను తవ్వి భారీ ధరకు విక్రయిస్తున్నారు. హిందూపురం పెన్నానదిలో బేవనహళ్లి, సతేబిందనూరు, కొడిగెనహళ్లి, తుమ్మలకుంట, పరిగి, రొద్దం ప్రాంతాల్లో భారీగా తవ్వకాలు చేపట్టి టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానంగా చిత్రావతి నదిలో సీసీ, పీసీ ఇసుక రీచ్‌లలో ధర్మవరంలో నియోజకవర్గానికి చెందిన కూటమి పార్టీల నాయకులు కొందరు బినామీలను పెట్టుకుని పోటీపడి ఇసుకను రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా జిల్లా అంతటా అక్రమార్కులకు ఇసుక కాసుల వర్షం కురిపిస్తోంది. వీటిని అడ్డుకోవాల్సిన సంబంధిత అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నీటి పేరుతో అదనపు బాదుడు

జిల్లాలో నెల రోజులుగా ఇసుక డిమాండ్‌ను బట్టి ధరలు పెంచేశారు. సాధారణ రోజుల్లో జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ట్రాక్టర్ ఇసుక రూ.1800 దొరికేది. ప్రస్తుతం రూ.3000 దాకా విక్రయిస్తున్నారు. కొత్తచెరువులో ట్రాక్టర్ రూ. 2లోపే దొరికే ఇసుక ప్రసుత్తం రూ. 3వేల పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ముదిగుబ్బ మండలం ఉప్పలపాడు, పీసీ రేవుల నుంచి రవాణా చేసే ఇసుక నెల కిందట దాకా 20 టన్నుల టిప్పర్ రవాణా చార్జీలతో కలిపి ధర్మవరంలో రూ.15 వేలకు దొరికేది. ఇప్పుడు దానిపై ఒకేసారి రూ.3వేలదాకా పెంచారు. ఇసుక రీచ్‌లు సమీపంలోనే ఉన్నా ముదిగుబ్బలోనే ట్రాక్టర్ రూ. 3వేలకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. గోరంట్లలో 20 టన్నుల ఇసుక టిప్పర్ రూ.23 వేల ధర పలుకుతోంది. ధర్మవరంలో ట్రాక్టర్ రూ.3వేల పైమాటే. కొందరు చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో ముందస్తుగా ఇసుక డంప్‌లు చేసి ప్రసుత్తం కృతిమ కొరత సృష్టించి సామాన్యులను దోచేస్తున్నారు. ప్రభుత్వం ఉచిత విధానం ప్రకటించినా కొందరు అక్రమార్కులు నదుల్లో నీటి నిల్వతో ఇసుక లభ్యతలేదని చెప్పి, ధరలు పెంచి జేబులు నింపుకుంటున్నారు. ఈనేపథ్యంలో నిర్మాణ వ్యయం పెరిగి, సామాన్యులు నిర్మాణాలను నిలిపేసే పరిస్థితి ఏర్పడింది.

చిత్రావతి పక్కనే ఉన్నా..



ప్రభుత్వం ఇసుక పూర్తిగా ఉచితం అంటోంది. వ్యాపారులు చిత్రావతిలో ఇసును ఉచితంగా తీసుకుని రవాణా పేరుతో అధిక ధరలకు అమ్ముతున్నారు. మాకు చిత్రావతి నది పక్కనే ఉన్నా ట్రాక్టర్ ఇసుక రూ. 2500 పెట్టి కొనుగోలు చేయాల్సివస్తోంది. చిత్రావతిలో నీరు ఉందని కొందరు ధర పెంచి ట్రాక్టర్ రూ. 3వేలకు అమ్ముతున్నారు. అయినా నాణ్యమైన ఇసుక దొరకడంలేదు. పుట్టపర్తిలో ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తే వినియోగదారులకు నాణ్యమైన ఇసుకతోపాటు అదనపు భారం తగ్గుంది.

-శ్రీనివాసులు, ఇంటి నిర్మాణదారుడు, పుట్టపర్తి

పెన్నానది నుంచి..



మా గోరంట్ల పక్కనే చిత్రావతి నది ఉంది. ప్రస్తుతం నదిలో చాలా ప్రాంతాల్లో నీరు ఉంది. నదిలో ఇసుక దొరికిన నిర్మాణానికి పనికి వచ్చే పరిస్థితి లేదు. ఇసుక దొరక్కపోవడంతో 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెన్నా నది నుంచి ఇసుకను కొనుగోలు చేయాల్సివస్తోంది. ట్రాక్టర్ రూ. 3500 టిప్పర్ రూ.23 వేలు పెట్టి కొంటున్నాం. ఇసుక ధర పెరగడంతో నిర్మాణాలు అర్థాంతరంగా నిలిపేస్తున్నారు.

-వెంకటరామప్ప, భవన నిర్మాణ మేస్త్రీ, గోరంట్ల

కొరత రానియ్యం

చిత్రావతిలో సీసీ, పీసీ రేవుల్లో 2500 టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. వర్షాకాలం నేపథ్యంలో చిత్రావతి నదిలో నీరు ఉంది. జిల్లాలో ప్రసుత్త అవసరాల ఎంత మేర ఉన్నాయన్నది ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. బుధవారం నుంచి సీసీ,పీసీ ఇసుక రీచ్‌ల్లో టెండర్లదారులు ఇసుక తవ్వకాలు ప్రారంభించారు. ఇసుక కొరత రానివ్వకుండా చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా అధిక ధరలకు ఇసుక విక్రయిస్తున్నట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాం.

-ఒబుళరెడ్డి, భూగర్భ, గనులశాఖ జిల్లా అధికారి

లోకల్‌కే ప్రాధాన్యం

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి కసరత్తు

80లో 51పోస్టులు మున్సిపాలిటీలకే..

అనంతపురం విద్య, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సబ్జెక్టు టీచర్లు లేని పాఠశాలలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల(వలంటీర్లు) నియామకానికి విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో స్థానిక అభ్యర్థులకే ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. జిల్లాకు 80 అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు మంజూరైన విషయం తెలిసిందే. ఇందులో ఎస్‌జీటీ 20, స్కూల్ అసిసెంట్ 60 పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టులను ఆయా పాఠశాలలకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనరే కేటాయించి జాబితా పంపారు. అయితే వీటిలో కొన్ని పోస్టులను అవసరం ఉన్న ఇతర స్కూళ్లకు మార్పు చేయడానికి జిల్లా విద్యాశాఖ అధికారులు ఆలోచించి ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్లారు. ఇందుకు కమిషనర్ అంగీకరించకపోవడంతో పాటు ఒక్క పోస్టు కూడా మార్పు చేయకూడదని, అలా ఎవరైనా చేస్తే చర్యలు తప్పవని డీఈఓలను హెచ్చరించారు. దీంతో రాష్ట్రశాఖ నుంచి వచ్చి జాబితా మేరకు ఆయా పాఠశాలలకే అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు ఇవ్వనున్నట్లు డీఈఓ వెల్లడించారు.

మున్సిపాలిటీలకే అధికం

జిల్లాకు కేటాయించిన 80 అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులలో అత్యధికంగా మున్సిపాలిటీలకే కేటాయించారు. జిల్లాలోని రాయదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి, మున్సిపాలిటీలతో పాటు అనంత కార్పొరేషన్‌కు కలిపి 51 పోస్టులు కేటాయించారు. ఇందులో ఎస్జీటీ 14, స్కూల్ అసిస్టెంట్ 37పోస్టులు మున్సిపాలిటీలకే కేటాయించారు. మిగిలిన 29 పోస్టులలో గవర్నమెంట్ స్కూళ్లకు 4, మండల, జిల్లా పరిషత్ స్కూళ్లకు 25 పోస్టులు మాత్రమే కేటాయించారు. ఇందులో అత్యధికంగా గుమ్మఘట్ట 8, డి. హీరేహాళ్ 5, రాయదుర్గం 5, అనంతపురం, అనంతపురంరూరల్ కలిపి 3, బొమ్మనహాళ్, బుక్కరాయసముద్రం, కళ్యాణదుర్గం, కణేకల్లు, కుందుర్పి, శెట్టూరు మండలాలలో ఒక్కో పోస్టు ఉన్నాయి.

రిజర్వేషన్లు లేవు

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకాలలో రిజర్వేషన్లు ఉండవని డీఈఓ ప్రసాద్‌బాబు అన్నారు. విద్యార్హత, స్థానికత ఆధారంగా ప్రాధాన్యం ఇస్తామన్నారు. లోకల్‌లో పోటీ ఉంటే అపుడు అకడమిక్‌కు 75శాతం, ప్రొఫెషనల్‌కు 25శాతం మార్కులు తీసుకొని అందులో ఎవరికి అర్హత ఉందో వారికే పోస్టు ఇస్తామన్నారు. అభ్యర్థులు ఆయా మండలాల ఎంఈఓలకు దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుందన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కమిషనర్ మార్గదర్శకాల మేరకు అభ్యర్థుల ఎంపిక చేపడతామన్నారు. కలెక్టరు ఆమోదంతో ఈనెల 8వతేదీకి నియామక ఉత్తర్వులు ఇస్తామని డీఈఓ తెలిపారు.

స్పందన లేక..!

పోలీసుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

ఆత్మహత్యకు యత్నించిన ఇంటర్ విద్యార్థిని మృతి



స్పందన (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తోటి విద్యార్థి దురుసుతనం, పోలీసుల నిర్లక్ష్యం కలగలిసి ఓ నిండుప్రాణాన్ని బలితీసుకున్నాయి. ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థి బుధవారం మృతి చెందింది. ఈమె గతనెల 26న ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని పులేటిపల్లి గ్రామానికి చెందిన అమల, ఆంజనేయులు దంపతుల కుమార్తె స్పందన(17)ధర్మవరంలోని ఓ ప్రైవేటు కాలేజ్‌లో ఇంటర్ సెకండియర్ చదివేది. ఇదే మండలంలోని మరో గ్రామానికి చెందిన విద్యార్థి ధర్మవరంలో మరో కాలేజ్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బస్సులో కాలేజీకి వెళ్లివచ్చే క్రమంలో తరుచూ ఆ విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వచ్చాడు. వైఖరి మార్చుకోవాలని ఆమె తీవ్రంగా హెచ్చరించింది. దీంతో ఆ విద్యార్థి నానా దుర్భాషలాడుతూ విచక్షణారహితంగా బస్సులోనే దాడి చేశారు. ధర్మవరంలో బస్సు దిగి కాలేజీకి వెళ్తున్న సందర్భంలోనూ మరోసారి దాడి చేశాడు. దీంతో ఆ విద్యార్థిని పట్టణంలోని పోలీసు స్టేషన్‌కు వెళ్లి సంఘటన గురించి తెలిపింది. చెన్నేకొత్తపల్లి పరిధిలో జరిగిందని, అక్కడికి వెళ్లి ఫిర్యాదు చేయాలని పోలీసులు చెప్పి పంపించారు. దీంతో ఆ విద్యార్థిని గత నెల 26న తల్లిదండ్రులతో కలిసి చెన్నేకొత్తపల్లి పోలీసు స్టేషన్‌కు వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. అయితే అక్కడ పోలీసులు ఫిర్యాదుపై పెద్దగా స్పందించలేదు. పోలీసుల తీరుతో మనస్తాపానికి గురైన బాలిక ఇంటికి వెళ్లి ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించి ఆ విద్యార్థినిని వేధించి, దాడి చేసిన విద్యార్థిపై ఆత్మహత్యకు ప్రేరేపణ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా తాము ఫిర్యాదు చేసిన రోజే పోలీసులు సక్రమంగా వ్యవహరించి ఉంటే తాము తమ బిడ్డను కోల్పోయేవారం కాదని మృతురాలి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే తమకు కడుపుకోత మిగిలిందని విలపించారు.

అమ్మ.. అశ్వత్థరెడ్డీ..!

భార్య ఖాతాకి నిధుల మళ్లింపు

రికార్డులు ఇవ్వకుండా డ్రామాలు

వెలుగులోకి కంబదూరు కార్యదర్శి లీలలు

డీపీఓకి ఫిర్యాదు చేయనున్న ప్రస్తుత కార్యదర్శి

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కంబదూరు పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూ సస్పెండ్ అయిన అశ్వత్థరెడ్డి లీలలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో ఒకే ఫోన్ నంబరుతో 3714 కుటుంబాలను నమోదు చేయడంతో ఆయన్ను ఇదివరకే సస్పెండ్ చేశారు. ఇది మాత్రమే కాదు ఆయన ఇన్‌చార్జ్‌గా పని చేసిన నాలుగు పంచాయతీల్లోనూ మూడో కంటికి తెలియకుండా నిధులను తన భార్య సుమలత పేరు మీదికి బదిలీ చేసుకున్నాడు. ఈ విషయం నూతనంగా బాధ్యతలు చేపట్టిన కార్యదర్శి పరిశీలనలో వెలుగులోకి వచ్చింది. 15 రోజుల వ్యవధిలోనే పంచాయతీలకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేసినట్లు చెప్పారు. అయితే అందుకు సంబంధించి రికార్డులు మాత్రం చూపడం లేదు. ఇదే పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే ఏజీ ఆడిట్ టీమ్ పలు రికార్డులు తనిఖీ చేసినట్లు తెలిసింది. అయితే ఆ కార్యదర్శి తమ పరిధిలో ఖర్చు చేసిన వివరాలకు సంబంధించి రికార్డులు అందించకుండా 2021-22 ఏడాదికి సంబంధించి రికార్డులు అందించి చేతులు దులుపుకున్నారన్న ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఆ కార్యదర్శి సస్పెన్షన్‌లో ఉండటంతో ఆయన లీలలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న కార్యదర్శి పలు ఆధారాలతో డీపీఓకు ఫిర్యాదు చేయడానికి డీపీఓ కార్యాలయానికి వెళ్లినట్లు సమాచారం. డీపీఓ అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగినట్లు తెలిసింది.

కార్యదర్శి అక్రమాల పర్వం ఇలా..

పంచాయతీ కార్యదర్శి అశ్వత్థరెడ్డి కంబదూరు పంచాయతీతో పాటు రాళ్లఅనంతపురం, కర్తనపర్తి, కురాకులపల్లి, చెన్నంపల్లి పంచాయతీలకు కూడా ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించారు. కురాకులపల్లికి సంబంధించి దాదాపు రూ.10 లక్షల వరకు 15వ ఆర్థిక సంఘం నిధులు తన భార్య సుమలత పేరుమీద బదిలీ చేసుకున్నారు. ప్రస్తుత కార్యదర్శి శ్రీరాములు ఈ విషయాన్ని గుర్తించి డిప్యూటీ ఎంపీడీఓ లీలాబాయితో పాటు ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. వాటికి సంబంధించి ఎమ్‌బుక్స్ గాని, ఓచర్స్ గాని ఏ ఒక్కటి ఇప్పటి వరకు చార్జ్ అప్పగించడంలో భాగంగా ఇవ్వనట్లు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ నిధుల మళ్లింపునకు సంబంధించి ఆ పంచాయతీ సర్పంచ్‌కు కూడా సమాచారం లేదు. రాళ్ల అనంతపురం పంచాయతీకి సంబంధించి నవంబరు 7న, నీటి సరఫరా, శానిటేషన్ పేరుతో సీ. సుమలత పేరు మీద రూ.5,10,351 బదిలీ చేసినట్లు తెలిసింది. అక్టోబరు 22న కురాకులపల్లి పంచాయతీ నుంచి నీటి మోటార్స్ ఏర్పాటుకు, పైప్‌లైన్స్ ఏర్పాటు పేరుతో అదే సీ. సుమలత పేరు మీదికి రూ.4,51,897 బదిలీ చేశారు. అదే పంచాయతీ నుంచి అక్టోబరు 29న వాటర్ వర్క్స్ పేరుతో సీ. సుమలత పేరుమీదికి రూ.5,01,283 బదిలీ చేశారు. కేవలం 15 రోజుల్లోనే రూ.14,63,531 నిధులు దారి మళ్లించినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడానికి రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. దీంతోపాటు రికార్డులన్నీ ఏజీ ఆడిట్‌కు అందిస్తే, మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. దీనిపై కలెక్టర్ పూర్తి స్థాయిలో విచారణ చేసి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

టమోటా కిలో రూ.34

అనంతపురం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో బుధవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.34తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.17తో, సరసరిగా రూ.24తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1650 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

చీనీ టన్ను రూ.21వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.21వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 37టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

పంచాయతీల్లో లూటీ..!

(5వ పేజీ తరువాయి)

ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. నిధుల దుర్వినియోగంపై సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం.

ఆ అధికారి కనుసన్నల్లోనే..

సర్పంచ్‌లతో ఓ అధికారి కుమ్మక్కై నిధులను పక్కదారి పట్టిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో ఆ అధికారి ములాఖత్ అయి.. ఎక్కువగా వారికే పనులు చేస్తూ, ఆమ్యామ్యాలు పుచ్చుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనంతపురంలోనే ఉంటూ వసూళ్ల పర్వం సాగిస్తున్నారని మండలంలో చర్చ సాగుతోంది. కంప్యూటర్, రికార్డులన్నీ అనంతపురంలో పెట్టుకుని అక్కడి నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

విచారించి.. చర్యలు తీసుకుంటాం

ఆయా పంచాయతీల్లో నిధుల వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఇప్పటికే ఆయా పంచాయతీల రికార్డులను తనిఖీ చేస్తున్నాం. విచారించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

-సూర్యనారాయణ, ఎంపీడీఓ, కంబదూరు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



కొండయ్య (ఫైల్)

పామిడి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. పామిడి మండలంలోని పాళ్యం గ్రామానికి చెందిన కొండయ్య(58) అనే రైతు బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కొండయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగించేవారు. పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చలేక నాలుగు ఎకరాలలో ఎకరా పొలం అమ్మేశారు. అయినప్పటికీ దాదాపు రూ. 6 లక్షలు అప్పు మిగిలింది. మూడు ఎకరాలలో సాగు చేస్తున్న చీనీ చెట్లు కోతకు వచ్చేందుకు మరో మూడేళ్లు పడుతుందని.. అంతవరకూ అప్పుల బాధను తాళలేక పొలంలోనే పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పామిడి ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్సకు అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడికి భార్య శ్యామల, కుమారుడు గోపాలకృష్ణ ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బొలెరో వాహనానికి నిప్పు

అప్రమత్తమైన పోలీసులు



కాలిపోయిన బొలెరో వాహనాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీం

యల్లనూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నపూసపల్లిలో విజయ్‌కుమార్ అనే వ్యక్తికి చెందిన బొలెరో వాహనానికి గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి నిప్పుపెట్టినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. విజయ్‌కుమార్ తన బొలెరో పికప్ వాహనాన్ని ఇంటి ముందు ఉంచారు. సుమారు రాత్రి 11గంటల ప్రాంతంలో వాహనం నుంచి మంటలు కనిపించడంతో వెళ్లి ఆర్పే ప్రయత్నం చేయగా అప్పటికే వాహనం పూర్తిగా దగ్ధమైంది. అరటిగెలలు మార్కెట్‌కు తరలించేందుకు వాహనం అద్దెకు పంపుతానని బాధితుడు తెలిపారు. వాహన విలువ సుమారు రూ.6లక్షలకు పైగా ఉంటుందని తెలిపారు. గిట్టనివారు ఈ పనిచేసి ఉంటారని బాధితుడు వాపోయాడు.

అప్రమత్తమైన పోలీసులు

ఫ్యాక్షన్ గ్రామమైన వెన్నపూసపల్లిలో అర్ధరాత్రి బొలెరో వాహనం దగ్ధమైన విషయం తెలియగానే హుటాహుటిన పోలీసులు గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. బుధవారం ఉదయం సీఐ సత్యఏసుబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, డాగ్, క్లూస్‌టీంను రప్పించి విచారణ చేపట్టారు.

వందే భారత్‌కు ప్రశాంతి నిలయంలో స్టాపింగ్

గుంతకల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కలబురగి-బెంగళూరు-కలబురగి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ఇకపై సత్యసాయి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్‌లోనూ నిలపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైలును జనవరి 2వ తేదీ నుంచి ఎస్ఎస్‌పీఎన్ స్టేషన్‌లో రెండు నిమిషాలసేపు స్టాపింగ్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అలాగే ఈ రైలు వేళలను కూడా సవరించినట్లు తెలిపారు. కలబురగి-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (నం. 22231) ఉదయం 5-15 గంటలకు కలబురగిలో బయలుదేరి, మధ్యాహ్నం 2 గంటలకు బెంగళూరుకు చేరేది. ఇకపై ఈ రైలు ఉదయం 6-10 గంటలకు బయలుదేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 22232) బెంగళూరులో 15 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరి, మునుపటి సమయంలోనే గమ్యస్థానానికి చేరుతుందన్నారు. ఇదేవిధంగా యశ్వంతపూర్-మచిలీపట్టణం ఎక్స్‌ప్రెస్ (నం. 17212) బెంగళూరులో జనవరి 1 నుంచి మధ్యాహ్నం 1-15 గంటలకు కాకుండా 12-45 గంటలకే బయలుదేరుతుందన్నారు. కానీ గమ్యస్థానానికి యథా ప్రకారంగానే చేరుతుందన్నారు. బెంగళూరు-భువనేశ్వర్ మధ్య నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (నం. 18464)ను గిద్దలూరు స్టేషన్ నుంచి డోన్ స్టేషన్ వరకూ సమయాలను మార్పుచేసినట్లు తెలియజేశారు. ముంబై-కోయంబత్తూరు కుర్లా ఎక్స్‌ప్రెస్ (నం. 11013) జనవరి 1 నుంచి ధర్మవరం నుంచి ధర్మపురం స్టేషన్ వరకూ వేళలను స్వల్పంగా మార్పుచేసినట్లు వివరించారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

● విద్యుత్ సేవల్లో అనంతను రోల్ మోడల్‌గా నిలపాలి ● అధికారులకు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సూచన

అనంతపురంరూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు అధికారులు ప్రజలకు మెరుగైన సేవలందించాలని, విద్యుత్ సేవల్లో జిల్లాను రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా నిలపాలని రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశవ్ సూచించారు. స్థానిక జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయ ఆవరణలో బుధవారం విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్ అధ్యక్షతన విద్యుత్ ప్రమాదాల-నివారణపై 'మీ భద్రతే-మాలక్ష్యం' కార్యక్రమం జరిగింది. మంత్రి కేశవ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యుత్ సంస్కరణలకు నాంది పలికిన వ్యక్తి సీఎం చంద్రబాబు నాయుడు అని అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర విద్యుత్ పంపిణీ వ్యవస్థ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. విద్యుత్ లైన్‌మెన్లు ఆర్థరాత్రి విద్యుత్ స్తంభం ఎక్కి పనిచేస్తారని, వారి పట్ల అధికారులు సానుభూతితో వ్యవహరించాలని అన్నారు. వారి ఇబ్బందులను గుర్తించడంతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. తద్వారా మరింత ఉత్సాహంతో పని చేసి శాఖకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తారని తెలిపారు. అందుకు ప్రభుత్వ సహకారం ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులకు, రైతులకు మెరుగైన సేవలందించాలని, జిల్లాను విద్యుత్ సేవల పరంగా మొదటి స్థానంలో నిలిపేందుకు అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేయాలని సూచించారు. అనంతరం విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహనలో భాగంగా విద్యుత్ రక్షక్ వాహనాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో తిరుపతి ఏపీఎస్‌పీడీసీఎల్ సీజీఎం జనార్దన్ నాయుడు, సీఈ విశ్వనాథ్‌రెడ్డి, విద్యుత్ శాఖ టెక్నికల్ ఈఈ ప్రసాద్, ఈఈలు జేవీ రమేష్, రవిశంకర్, డీఈఈలు. ఏఈఈలు పాల్గొన్నారు.


విద్యుత్ రక్షక్ వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

రైతుల సంక్షేమం కోసం సీఎం కృషి

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు తీవ్ర కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. శింగనమల మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల ఆవరణలో బుధవారం సాయంత్రం ఆమె రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. రైతుల కోసం కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు అమలు తీరును వివరించారు. శింగనమల నియోజకవర్గంలో అరటిసాగు విస్తరణ పెరగడానికి 2019కి ముందు టీడీపీ పాలనలో రైతులకు మొక్కలు, డ్రిప్పు, స్ప్రింకర్లు రాయితీతో ఇవ్వడమే కారణమన్నారు. నియోజకవర్గంలో పండిన అరటి పంట ను విదేశాలకు సైతం ఎగుమతి చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం అరటికి ధర లేదంటూ వైసీపీ వారు చేస్తున్న ఫేక్ ప్రచారాలు నమ్మవద్దని, అరటికి టన్నుకు రూ.15 వేల చొప్పున గిట్టుబాటు ధర ఇప్పిస్తామని చెప్పారు. రైతుల అభ్యున్నతి కోసం సీఎం చంద్రబాబు నిరంతర కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రవికుమార్, శాస్త్రవేత్త మల్లీశ్వరి, శింగనమల మార్కెట్ యార్డు చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాసులు టీడీపీ మండల కన్వీనర్లు గోరంట్లమారుతినాయుడు, బోయ కుళ్లాయప్ప, రామాంజనేయులు, ఓబుళాపురంశీనా, లక్ష్మీ నారాయణ, పాండు, నాయకులు ఆదినారాయణ, దేగలక్ష్మమూర్తి, గుర్రం లక్ష్మీనారాయణ, గార్లదిన్నె సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

● అధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన


సభలో మాట్లాడుతున్న పరిటాల సునీత

ఆత్మకూరు డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయశాఖ అధికారులు నిత్యం అందుబాటులో ఉండి సేవలందించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. మండలంలోని సనప గ్రామంలో బుధవారం వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా రైతు సేవా కేంద్రం వద్ద రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు పంచ సూత్రాలపై రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతులు పంటల సాగులో కష్టనష్టాలను ఎదుర్కోకుండా దృష్టి తీసుకురావాలన్నారు. దీంతో వ్యవసాయ అధికారులు రైతులు చెప్పే అంశాలను బట్టి వచ్చే ఖరీఫ్, రబీ సీజన్లలో ఎలాంటి పంటలు సాగుచేయాలనే దానిపై యాక్షన్ ప్లాన్ తయారు చేస్తారన్నారు. రైతులు నష్టపోకుండా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. పంటల సాగులో సలహాలలో అధికారులు సూచనలు, సలహాలు తెలియజేస్తే రైతులు నష్టపోకుండా ఉంటారన్నారు. అనంతరం ప్రజలు అడిగిన ప్రశ్నలకు జిల్లా వ్యవసాయ అధికారులు పలు సూచనలు సలహాలను తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జ్ బాలాజీ, మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్, మండల కన్వీనర్లు శ్రీనివాసులు, పోతులయ్య, సింగిల్ విండో చైర్మన్ కృష్ణమోహన్ చౌదరి, టీఎన్ఎస్‌ఎఫ్ నాయకుడు పరశురామ్, పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయ జీర్ణోద్ధరణకు రూ.3.6 కోట్లు

● మంజూరు చేసిన దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

● ఫలించిన ఎమ్మెల్యే దగ్గుపాటి కృషి


కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం


మంత్రి ఆనంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి (ఫైల్)

అనంతపురం టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని మొదటిరోడ్డులో గల కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం జీర్ణోద్ధరణ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.3.6కోట్లను మంజూరు చేసింది. దీంతో స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ కృషి ఫలించినట్లైంది. వందేళ్ల పూర్తి చేసుకున్న ఆలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో జీర్ణోద్ధరణ పనుల కోసం కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎమ్మెల్యే దగ్గుపాటి నిధుల కోసం ప్రయత్నం చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో గత నెలలో దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి విన్నవించారు. ఇందుకు స్పందించిన మంత్రి నిధుల మంజూరు కోసం చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు ఆలయ జీర్ణోద్ధరణకు రూ.4.50 కోట్లు అవసరమవగా రూ. 3.6కోట్లు విడుదల చేస్తూ మంత్రి ఉత్తర్వులు జారీ చేశా రు. ఈ విషయంపై ఎమ్మెల్యే బుధవారం లేఖను సైతం పంపారు. మిగిలిన 20 శాతం(రూ.90లక్షలు) నిధులను ప్రజలు అందించే విరాళాల ద్వారా సేకరించాలని సూచించారు. కాగా ఈ అంశంపై ఎమ్మెల్యే దగ్గుపాటి స్పందిస్తూ భక్తుల అభిప్రాయాలను గౌరవించి సీఎం చంద్రబాబు, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నిధుల మంజూరుకు సహకరించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే ఆలయ జీర్ణోద్ధరణ పనులు ప్రారంభిస్తామని, జిల్లాలోనే ఈ ఆలయాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

సామాజిక రంగాల్లో ఎస్కేయూది కీలక పాత్ర

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విద్య, పరిశోధనలతో కాకుండా సామాజిక అభివృద్ధి రంగాల్లో కూడా కీలక పాత్ర పోషిస్తోందని ఆ యూనివర్సిటీ ప్రొఫెసర్లు మునినారాయణప్ప, రమణ అన్నారు. కూడేరులో బుధవారం ఎస్కేయూ సీఎస్ఎస్ఆర్, సీసీడీ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు సమగ్ర వ్యవసాయ విధానాల అభివృద్ధిపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ఎస్కేయూ ప్రొఫెసర్లు మునినారాయణప్ప, రమణ, మండల వ్యవసాయాధికారి సుభాకర్, సీసీడీ ప్రాజెక్ట్ మేనేజర్ నటరాజ్, సీఎస్ఎస్ఆర్ సహాయ ఆచార్యులు డాక్టర్ శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్లు మాట్లాడుతూ... సామాజిక-ఆర్థికంగా వెనుకబడిన వర్గాల రైతులకు ప్రభుత్వ వ్యవసాయ విధానాలపై స్పష్టమైన అవగాహన కల్పించి, రైతుల సమస్యల పరిష్కారానికి సూచనలను అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

స్వామిత్వ సర్వేను వేగవంతం చేయండి


సర్వేను పరిశీలిస్తున్న డీపీఓ

అనంతపురం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేను వేగవంతంగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు సూచించారు. మండలంలోని ఆకుతోటపల్లిలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను పరిశీలించారు. ఇంటి కొలతలు ఎలా తీస్తున్నారు. డ్రోన్ ద్వారా తీసిన కొలతలు ఎలా వస్తున్నాయని సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల ఆస్తులపై చట్టబద్ధమైన యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. సర్వే పూర్తయిన తర్వాత ప్రతి ఆస్తి యాజమానికి ప్రభుత్వ అధికార చిహ్నంతో కూడిన కార్డును అందించనున్నట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

గార్లదిన్నె, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయాల అధికారిగా ఉషారాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురంలోని డీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ఈమెకు గార్లదిన్నె మండల సచివాలయాల అధికారిగా ఉద్యోగోన్నతి లభించింది. మండలకేంద్రంలోని సచివాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం తోటి అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

డిప్యూటీ ఎంపీడీఓగా అచ్యుతానంద

రాప్తాడు, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓగా అచ్యుతానంద బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు అదే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ఆయనకు ఉద్యోగోన్నతి లభించింది. బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయనకు ఎంపీడీఓతోపాటు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

లైసెన్స్ రద్దుకు ప్రతిపాదనలు

అనంతపురం అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని పాతూరులో గల సిరిగుప్ప ఆగ్రో ఏజెన్సీస్ సంబంధించిన లైసెన్స్ రద్దు చేసేందుకు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ ప్రతిపాదించారు. ఈ మేరకు బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మకు ఆ లైసెన్స్ రద్దు చేసేందుకు కారణాలను వివరిస్తూ ప్రతిపాదనలు పంపారు. సిరిగుప్ప ఆగ్రో ఏజెన్సీస్ హోల్‌సేల్ డీలర్ ఐకేఎల రిటైల్ డీలర్లకు యూరియా సరఫరాలో అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించామన్నారు. దీనిపై సదరు డీలర్‌ను వివరణ కోరగా అవకతవకలు జరిగినట్లు అంగీకరించారని ఏడీఏ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో లైసెన్స్ రద్దు కోసం జిల్లా వ్యవసాయ అధికారికి ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు.

'ఆ భవనాలను క్రమబద్ధీకరించుకోండి'

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా అక్రమంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకోవాలని అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి సూచించారు. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా... 2025 ఆగస్టు 31వ తేదీ తరువాత నిర్మాణ దశలో ఉన్న భవనాలను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం ద్వారా క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఒకే ఒకసారి మాత్రమే ఇచ్చిన అవకాశమని, నగరపాలక సంస్థ పరిధిలోని భవనాల యజమానులు నిబంధనల ఉల్లంఘన భవనాలను క్రమబద్ధీకరించుకోవాలని చెప్పారు. నిర్ణీత గడువులోగా అన్ని డాక్యుమెంట్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని, నిర్ణయించిన జరిమానా చెల్లించి, చట్టబద్ధ చేసుకోవాలన్నారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యల్లో భాగంగా ఆయా భవనాలను గుర్తించి తొలగిస్తామని హెచ్చరించారు. సందేహాల నివృత్తికి ఏఎంసీలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో సంప్రదించాలని కోరారు.

గ్యాస్ అక్రమ రీఫిల్లింగ్‌పై దాడులు

అనంతపురంరూరల్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంట ఇప్పెప్సాక్ కాలనీలో వంట గ్యాస్‌ను అక్రమంగా రీఫిల్లింగ్ చేస్తున్న స్థావరంపై రెవెన్యూ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. మండల సీఎస్‌డీటీ బాషా, వీఆర్వో రామకృష్ణ ఆధ్వర్యంలో ఆగ్రహారం రామేశ్వరి ఇంట్లో దాడులు చేసి అక్రమ గ్యాస్‌ను రీఫిల్లింగ్ చేసిన 20 డొమెస్టిక్ ఎల్‌పీజీ సిలిండర్లు, మూడు ఖాళీ సిలిండర్లు, ఎనిమిది కమర్షియల్ సిలిండర్లు, వేయింగ్ మిషన్లను సీజ్ చేశారు. రీఫిల్లింగ్ చేస్తున్న వారిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థుల ర్యాలీ


రామగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న దివ్యాంగులు

రామగిరి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని భవిత కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక అవసరాల విద్యార్థుల ర్యాలీ నిర్వహించారు. ఇందులో వక్తలు పాల్గొని మాట్లాడుతూ దివ్యాంగులు వైకల్యం గురించి దిగులు చెందకుండా నైపుణ్యాలను మెరుగు పరుచుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమపథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దివ్యాంగుల చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగావతి, ఎంఈఓలు వెంకటప్రకాశ్, శ్రీనివాసులు, ఐఈడీఎస్ఎస్ ఉపాధ్యాయులు బాలరాజు, రవికుమార్, ఐఈఆర్‌పీఎస్ రేణుకారాధా, ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● చెన్నేకొత్తపల్లిలో: మండలకేంద్రంలోని భవిత కేంద్రంలో గల దివ్యాంగ విద్యార్థుల చేత ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ బాలక్రిష్ణుడు, ఎంఈఓ ప్రసూన్ కుమార్‌నాయుడు దివ్యాంగుల చేత కేక్‌కట్ చేయించారు. కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం ఓబుళశమ్మ, భవిత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక రాజ్య స్థాపనే సీఐటీయూ లక్ష్యం

అనంతపురం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక ఐక్యతతో పెట్టుబడిదారీ విధానాన్ని కూల్చి కార్మిక రాజ్యాన్ని స్థాపించడం సీఐటీయూ లక్ష్యమని జిల్లా ఉపాధ్యక్షుడు మస్తిగల రామాంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని సోములదొడ్డిలో గల ఎంఎంఎల్ డిపోలో పనిచేస్తున్న హమాలీ కార్మికులతో కలిసి బుధవారం ఆయన అఖిల భారత 18వ మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మహాసభలు ఈనెల 31నుంచి జనవరి4వ తేదీవరకు విశాఖపట్నంలో జరుగనున్నట్లు చెప్పారు. ఈ మహాసభల్లో కార్మిక నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. గత 11ఏళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. మేస్త్రీ నాగార్జున, కార్మికులు తిరుపాలు, పెద్దన్న, మారుతి, మోహన్‌బాబు, రమణ, అంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల చిరుజల్లులు

అనంతపురంఅర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం చిరు జల్లులు పడ్డాయి. అనంతపురం, పుట్లూరు, నార్పల, పెద్దవడుగూరు తదితర మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మిగిలిన ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతం కావడంతో చల్లటి వాతావరణం ఏర్పడింది. మంగళవారం రాత్రి అనంతపురం, నార్పల ప్రాంతాల్లో తుంపర జల్లులు పడ్డాయి.

ఉలవల పంపిణీ

రామగిరి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతుసేవాకేంద్రాల్లో రైతులకు బిరుదాన్యాల సాగు కోసం ఉలవల పంపిణీని బుధవారం ప్రారంభించారు. మండలంలోని 11 రైతు సేవాకేంద్రాలు ఉండగా ప్రతి కేంద్రానికి 150 క్వింటాళ్ల ఉలవలు సరఫరా చేశారు. వీటిని రైతులకు ఒక్కొక్కరికి 20 కిలోల చొప్పున కిలో రూ.12లతో అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు, వ్యవసాయ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పోలీసులకు ఫైరింగ్ శిక్షణ


ఫైరింగ్ శిక్షణను పరిశీలిస్తున్న డీఎస్పీ నీలకంఠేశ్వర్ రెడ్డి

అనంతపురం క్రైం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ ఇటుకలపల్లి పరిధిలోని మస్టీరుల మైదానంలో బుధవారం పోలీస్ సిబ్బందికి ఫైరింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో టైడీల ఎస్కార్ట్ సిబ్బంది, గార్డ్ డ్యూటీల సిబ్బంది ఫైరింగ్‌పై శిక్షణ ఇచ్చారు. క్లోస్ రేంజ్, లాంగ్ రేంజ్ ఫైరింగ్ టెక్నిక్స్, ఆర్మ్స్ హ్యాండ్లింగ్, సేఫ్టీ ప్రోటోకాల్ తదితర అంశాలపై శిక్షణ అందించారు. ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్ఐలు బబ్లాన్, మగ్బూల్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో పారా క్రీడాపోటీల విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. శాప్ డైరెక్టర్ బొమ్మినేని శివ, డీఎస్‌డీఓ మంజుల బహుమతులు అందించారు. బొమ్మినేని శివ మాట్లాడుతూ పారా క్రీడా పోటీలలో విజేతలైన వివిధ ప్రతిభావంతుల ప్రతిభ స్ఫూర్తిదాయకమన్నారు. వివిధ ప్రతిభావంతులకు స్పోర్ట్స్‌లో రిజర్వేషన్ పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని కొనియాడారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు, డీఎస్ఏ సూపరింటెండెంట్ దేవమణి, శాప్ కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

రూ.38 వేలు ఇస్తేనే పని చేస్తా..!

● రైతులను డిమాండ్ చేసిన వీఆర్వో


వీఆర్వో వెంకోబారావు

నార్పల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'రూ. 38వేలు ఇస్తేనే నీ పని పూర్తి చేస్తా' అని రైతును డిమాండ్ చేసిన వీఆర్వో వెంకోబరావు కాల్ రికార్డు బుధవారం బట్టబయలైంది. వివరాల్లోకి వెళితే.. పనులు చేయాలంటే డబ్బులు ఇవ్వాల్సిందేనని సెల్‌ఫోన్‌లో రైతుతో దుగుమర్రి వీఆర్వో వెంకోబరావు మాట్లాడిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దుగుమర్రి రెవెన్యూ గ్రామ పరిధిలో రంగాపురం గ్రామ రైతులు నాగార్జున, కుళ్లాయప్పకు సంబంధించిన సర్వే నెంబరు 19, 90-2లో 5.11 ఎకరాల భూమి ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి వీఆర్వో వెంకోబరావును మూడు నెలల క్రితం కలిశారు. వీఆర్వో రూ.38వేలు ఇవ్వాలని డిమాండ్ చేయడం సంచలనంగా మారింది. ఆ డబ్బులు మూడు నెలల నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. వీఆర్వో వెంకోబారావు భూముల మ్యుటేషన్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతులు చేసేది లేక ఆయనకు రూ.10వేలు లంచం ఇచ్చారు. అయినా ఆ వీఆర్వో రైతుల సమస్యను పరిష్కరించలేదు. రైతులు నేరుగా ఫోన్‌చేసి రూ. 38 వేలు నగదు ఇస్తేనే సంతకం చేస్తానని తెలిపారు. డబ్బు ఇవ్వకుంటే ఆర్డీఓ కార్యాలయంలో మీ పని పెండింగ్‌లో పెట్టేస్తానని బెదిరించాడు. ఆ డబ్బులు తనకు ఒక్కడికే కాదని, పైఅధికారులకు ఇవ్వాలని, తమ బాధలు ఆరా చేసుకోవాలని చెప్పారు. వీఆర్వో మాట్లాడిన విషయమంతా రైతు లు రికార్డు చేసి సోషల్ మీడియా పెట్టారు. తర్వాత రైతులు మీడియాతో మాట్లాడుతూ.. తమ భూముల ఆన్‌లైన్‌లో ఎక్కించడానికి ఆ లంచం అడిగిన వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ ఆరుణ కుమారిని వివరణ కోరగా.. రైతులకు డబ్బులు డిమాండ్ చేసిన విషయంపై వీఆర్వో వెంకోబారావుపై నివేదిక తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపుతామని అన్నారు.

31 మందికి షోకాజ్

● ఓటరు జాబితా మ్యాపింగ్‌లో వెనుకబాటు

● విధుల్లో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్ల నిర్లక్ష్యం

అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యంలో వహించిన బూత్ లెవల్ ఆఫీసర్ల(బీఎల్‌ఓ)కు, పలువురు సూపర్‌వైజర్లకు అనంతపురం అర్బన్ అసెంబ్లీ ఎలెక్షన్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్(ఈఆర్ఓ), ఆర్డీఓ కేశవనాయుడు బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)-2025లో భాగంగా 2002 ఓటర్ల జాబితాను సంబంధించి ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియ చేపడుతున్నారు. ఈ విషయంలో వెనుకబడిన 20మంది బీఎల్‌ఓలకు, 11మంది సూపర్‌వైజర్లకు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. బీఎల్‌ఓలు హరికుమార్, కులశేఖర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, మమత, యస్యు, సుధ, ఉపేంద్ర, శ్రావణ్, హారతి, రమేష్, జ్యోతిలక్ష్మి, జ్యోత్స్న, సత్య గణేష్, చర్విత్, నాగరాజు, సునీత దేవి, సుకన్య, రమేష్, విజయలక్ష్మి, మహేష్ ఉన్నారు. సూపర్‌వైజర్లలో ప్రశాంత్, ఆనంద్‌రావు, సాయికిరణ్, ఆయప్ప, సుప్రజారెడ్డి, సాయికుమార్, వినయ్‌కుమార్, నవీన్‌కుమార్, వంశీకృష్ణ, యశ్వంత్, శ్రీధర్‌రావు ఉన్నారు. ఈ నెల 5వతేదీలోపు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారికి సంజాయిషీ ఇవ్వాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఈఆర్ఓ హెచ్చరించారు.

యువత సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టాలి

● జేఎన్‌టీయూ వీసీ ఆచార్య సుదర్శనరావు



మాట్లాడుతున్న వీసీ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యువత సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టాలని జేఎన్‌టీయూ వీసీ ఆచార్య సుదర్శనరావు సూచించారు. జేఎన్‌టీయూలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్(ఆర్‌టీఐహెచ్) ఆధ్వర్యంలో స్టార్టప్‌పై మూడ్రోజుల శిక్షణను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమానికి వీసీతో పాటు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఐసీ జీఎం శ్రీనివాస్ యాదవ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాప్ రెడ్డి, ఎస్కేయూ ఏపీసీ ప్రతినిధి చంద్రమౌళి, కేంద్ర విశ్వవిద్యాలయ అసిస్టెంట్ ప్రొఫెసర్ అభిషేక్ పాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ... యువత సృజనాత్మక ఆలోచనలకు పదునుపెట్టి భవిష్యత్తు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రాంతీయ యువతలో సృజనాత్మక ఆలోచనల పట్ల ఆసక్తి పెంపొందుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు ఇన్నోవేషన్, స్టార్టప్ ఎకోసిస్టమ్, కొత్త వ్యాపారాల్లో అవకాశాలు, సాంకేతిక ప్రాధాన్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల విద్యార్థులు, సైన్స్, ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమద్ వ్రతం


స్వామివారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం చేస్తున్న పురోహితులు

అనంతపురం టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని హౌసింగ్‌బోర్డులో గల భక్తాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం హనుమద్ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామునే స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించడంతో పాటు స్వామి వారి ఉత్సవ మూర్తికి భక్తుల చేతుల మీదుగా క్షీరాభిషేకం చేయించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. తర్వాత వేదపండితుల వేద మంత్రోచ్ఛారణల నడుమ భక్తులు హనుమద్ వ్రతాన్ని ఆచరించారు. ఆలయ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి పంపిణీ

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): భారత కేంద్ర యువజన వ్యవహారాల క్రీడల శాఖ, మేరా యువ భారత్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మైభారత్ కార్యాలయంలో యువజన, మహిళా సంఘాలకు క్రీడాసామగ్రి పంపిణీ చేశారు. మైభారత్ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ గోవర్ధన్ శ్రీనివాసులు, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడలలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర పతి అవార్డు గ్రహీతలు జీవన్‌కుమార్, జయమారుతి, యోగా గురువు మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పంటలు మార్చాలి..

రాప్తాడు, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మారుతున్న ఆహార అలవాట్లకు అనుగుణంగా రైతులు సాగు పద్ధతులు మార్చుకోవాలని డీఆర్‌సీ ఏడీఏ నైలజకుమారి సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం రైతన్నా మీకోసం వారోత్సవాలను నిర్వహించారు. ఇందులో ఏడీఏ పాల్గొని మాట్లాడారు. మారుతున్న ఆహార అలవాట్లకు అనుగుణంగా రాగి, జొన్న, సజ్జ, కొర్ర వంటి పంటలు సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మెప్మా ఆధ్వర్యంలో త్వరలో స్థానిక బళ్లారి రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌లో భాగంగా వీధి వ్యాపారుల కోసం షాపింగ్ కోసం వంద దుకాణాలను ప్రారంభించనున్నామని, వీటి కోసం వీధి విక్రయదారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు ఈనెల 8వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఏఎంసీ కమిషనర్ బాలస్వామి బుధవారం ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల వయసు పైబడిన వీధి విక్రయదారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ఓటరుకార్డు, పాన్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం, మూడు పాసుపోర్టుసైజు ఫొటోలతో నగరపాలక సంస్థలోని మెప్మా కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

భజన మందిరాల కోసం..

శింగనమల: గ్రామాల్లో భజన మందిరాల ఏర్పాటు కోసం భక్తులు దరఖాస్తు చేసుకోవాలని దేవదాయ శాఖ ఈఓ రంగస్వామి బుధవారం ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో దేవాలయ నిర్మాణ స్థలం ఆధారంగా మందిరాలను ఏ,బీ,సీలుగా విభజించి నిధులు మంజూరు చేస్తారన్నారు. భజన మందిరాల కోసం స్థల వివరాలు, యాజమాని ఎన్‌ఓసీ జత చేసి దేవాదాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు.

న్యూస్ బాక్స్

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కణేకల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కణేకల్లు క్రాసింగ్‌లో అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి, విఘ్నేశ్వరస్వామి, సుబ్రహ్మణ్యస్వామిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నల్లలమ్మకు పూజలు



కూడేరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నల్లలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి.. 41 రోజులైన సందర్భంగా బుధవారం ఘనంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణంలో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి అన్నసంతర్పణం చేశారు.

రేపు దత్తజయంతి మహోత్సవం

రాయదుర్గంరూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక షిర్డీసాయి బాబా మందిరంలో గురువారం శ్రీదత్తాత్రేయ జయంతి మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పేలుడు పదార్థాల కేసులో ముగ్గురి అరెస్ట్


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ

పెద్దవడుగూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురం కార్తికేయ ఎంటర్‌ప్రైజెస్‌లో రూ. రెండు లక్షల విలువైన పేలుడు పదార్థాల చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. యాడికి మండలం చందన గ్రామానికి చెందిన నగిరి రవికుమార్, పామిడి మండలం నాగిరెడ్డికాలనీకి చెందిన రాము, కర్నూలు జిల్లా మద్దికెర మండల కేంద్రానికి చెందిన వీరేష్‌ను గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామం వద్ద అరెస్ట్ చేశామని తెలిపారు. పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటుచేసి వీరిని అరెస్ట్ చేశామని వివరించారు. రవికుమార్ కొన్ని సంవత్సరాలుగా శ్యామ్‌కిరణ్ అనే వ్యక్తి వద్ద పనిచేసేవాడన్నారు. కొన్ని నెలలుగా జీతం సరిగా ఇవ్వలేదని, పలుసార్లు అడిగినా స్పందించకపోవడంతో మెటీరియల్ చోరీ చేసి, అమ్ముకోవడానికి పథకం వేసుకున్నాడని తెలిపారు. అతడికి ఉన్న పరిచయస్థులను కలుపుకొని చోరీ సొమ్మును దాచిపెట్టినట్లు విచారణలో తెలిసిందని వివరించారు.

ఆస్తి కోసం వేధింపులు - మామ అరెస్ట్

కళ్యాణదుర్గం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) ఆస్తి కోసం కోడలిని వేధించిన మామను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు బుధవారం నిందితుడిని అరెస్టు చేసినట్లు కంబదూరు ఎస్ఐ లోకేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కంబదూరు మండల పరిధిలోని తిప్పేపల్లిలో నివాసం ఉంటున్న వాణి, పవన్ అనే దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవించేవారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో భర్త పవన్ మృతి చెందాడు. అతడి భార్య వాణి పేరు మీద ఐదెకరాల పొలం, ఇల్లు, బొలెరో వాహనం ఉన్నాయి. భర్త చనిపోవడంతో వాణి పేరు మీద ఉన్న ఆస్తి, బొలెరో వాహనం విషయంలో ప్రతి రోజూ మామ గోవిందప్ప గొడవ పడుతూ ఉండేవాడు. దీంతో కోడలు వాణి కంబదూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని, నిందితుడిని బుధవారం అరెస్టు చేశారు. ఈ మేరకు నిందితుడిని కళ్యాణదుర్గం కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ లోకేశ్ తెలిపారు.

పంట సాళ్లలో నీరు నిల్వ ఉంచకండి


రైతులతో మాట్లాడుతున్న జిల్లా హార్టికల్చర్ అధికారి ఉమాదేవి

విడపనకల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మిరప పంట సాళ్లలో ఎక్కువ నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఉమాదేవి సూచించారు. మండలంలోని పాల్తూరులో మిరప పంటలను బుధవారం పరిశీలించిన ఆమె మాట్లాడారు. మిరప పంటలకు ఎండు తెగులు సోకకుండా జాగ్రత్తలు పాటించాలని, కాలువ నీరు మిరప సాళల్లో పారడం వల్ల మొక్క నుంచి మొక్కకు ఈ తెగులు వ్యాపిస్తుందన్నారు. పొలాల్లో నీటికుంటలు తవ్వించుకుని డ్రిప్‌ల ద్వారా నీటి వాడుకుంటే తెగులు నివారించుకోవచ్చు అన్నారు. బ్యాక్టీరియా వ్యాధులు సోకిన సమయంలో ఆక్సిడెంట్ క్లోరైడ్ మూడు గ్రాములు లీటర్ నీటిలో కలిపి మొక్కల మొదల్లో పిచ్చికారి చేయాలన్నారు. ఆమె వెంట శాస్త్రవేత్త యుగేందర్, ఏఓ హెచ్ పెన్నయ్య ఉన్నారు.

కొండకిందవీధిలో ఎమ్మెల్యే గ్రామసభ

యాడికి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకిందవీధిలో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి బుధవారం గ్రామసభ నిర్వహించారు. లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలని, ఇళ్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, వేములపాడు రోడ్డు కాలనీలో డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్థులు ఎమ్మెల్యేను కోరారు. సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఇందులో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ వీరరాజు, హౌసింగ్ జేఈ లోకేష్‌కుమార్, పీఆర్ డీఈ యల్లమనాయుడు, జేఈ వరప్రసాద్, టీడీపీ మండల కన్వీనర్ ఆదినారాయణ, యాడికి సింగిల్‌విండో చైర్మన్ చలమారెడ్డి, మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ శ్రీహరి పాల్గొన్నారు.

కేజీబీవీ తనిఖీ

బొమ్మనహాళ్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి) స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని అనంతపురం ఎస్ఎస్ఏ అధికారి కవిత, ఏపీఓ నారాయణస్వామి బుధవారం తనిఖీ చేశారు. సమస్యలపై విద్యార్థుల వద్ద ఆరా తీశారు. వారి వెంట ఎంఈఓ మల్లికార్జున, ప్రిన్సిపల్ కమలమ్మ ఉన్నారు.

కల్లాల్లో మొక్కజొన్న

- రైతులకు దిత్వా తుఫాన్ బెంగ
- ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతి


అవులెన్నలో కల్లంలో ధాన్యంపై టార్పాలిన్ కప్పిన దృశ్యం


ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతు

బెళుగుప్ప, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధర లేక మొక్కజొన్న పంట అమ్ముకోలేక రైతులు అవస్థలు పడుతున్నారు. కల్లాల్లోనే రాశులు పోసుకుని ప్రభుత్వం ఎప్పుడు కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తుందా అని ఎదురు చూస్తున్నారు. ఇలాంటి సమయంలో దిత్వా తుఫాన్ రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. వర్షాలు కురిస్తే పంటంతా తడిసిపోతుందనే బెంగ పట్టుకుంది. దీని ఆసరాగా చేసుకొని.. వ్యాపారులు, దళారులు కుమ్మక్కై క్వింటా రూ. 1600 నుంచి 1700లకు అడుగుతున్నారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ. 2400లకు కొనుగోలు చేస్తామని ప్రకటించడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. క్వింటాపై రూ. 700 వరకు ఆదాయం వస్తుందన్న ఆశతో ఉన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించి.. దళారుల బెడద నుంచి గట్టెక్కించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. మండలంలో ఖరీఫ్‌లో 6,092 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారని, అనుమతి రాగానే కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి పృథ్వీసాగర్ తెలిపారు.

ప్రభుత్వం స్పందించాలి



కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్నాము. తుఫాన్ ముప్పు ఉంది. వర్షాలు వస్తే పంట తడిసిపోయి దెబ్బ తింటుంది. ప్రభుత్వం త్వరగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే మేలు.

-తిప్పేస్వామి, రైతు, అవులెన్న

అన్నదాత ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: విప్


మురడిలో మాట్లాడుతున్న విప్ కాలవ


చిన్నంపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని

డీ.హీరేహాళ్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చి రైతు ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని మురడిలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని భైరవానితిప్ప ప్రాజెక్టు నుంచి నియోజకవర్గంలో 58 చెరువులకు నీరు అందించేలా రూ. 600 కోట్లతో ఓ ప్రణాళిక రూపొందించామన్నారు. అనంతరం మురడి నుంచి తమ్మేపల్లికి రూ. 70 లక్షలతో నిర్మించిన రోడ్డును విప్ ప్రారంభించారు. ఇందులో వ్యవసాయ జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ, మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ గంగాధర, ఆది, ఏడీ పద్మజ, ఎంపీడీఓ దాసానాయక్, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

చిన్నంపల్లిలో ఎమ్మెల్యే అమిలినేని...

● శెట్టూరు : ఇది రైతు ప్రభుత్వమని, వారి సంక్షేమం కోసం వ్యవసాయ పరికరాలు, డ్రిప్పు, స్ప్రింక్లర్లు, పైపులు అన్ని సబ్సిడీతో అందిస్తోందని, అన్నదాత సుఖీభవతో ఆదుకుంటోందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. బుధవారం చిన్నంపల్లిలో నిర్వహించిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాణ్యమైన విత్తనాలు అందించే చిన్న పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ఆ గ్రామానికి చెందిన రైతు తిమ్మక్కకు బ్యాంకు ద్వారా లోన్ ఇప్పిస్తామని, తనవంతుగా రూ. 50 వేలు అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గ్రామంలో బోరుకు మోటార్ ఏర్పాటు చేసి.. తాగునీటి సమస్యను పరిష్కరిస్తానన్నారు. ఇక్కడి స్థానిక పరిశ్రమల కోసం తాత్కాలికంగా క్వారీల ఏర్పాటు చేశారని, ఆ పనులు పూర్తి కాగానే ఆ క్వారీని తొలగిస్తారని, అంతేకాకుండా షాపులకు, తనకు ఎలాంటి సంబంధమూ లేదని, వీటిపై అవగాహన లేకుండా అసత్య ప్రచారాలు చేయడం తగదని అన్నారు. అనంతరం గ్రామంలో రూ. 13 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇందులో స్థానిక సర్పంచ్ అనురాధ, అధికారులు, టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


తాడిపత్రి: కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

తాడిపత్రి, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి తన నివాసంలో దివ్యాంగులతో కలిసి బుధవారం కేక్ కట్ చేశారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వీడియోకాల్ ద్వారా దివ్యాంగులకు శుభాకాంక్షలు తెలిపారు.

● గుంతకల్లు : విభిన్న ప్రతిభావంతులు, దివ్యాంగులకు రైల్వే శాఖ తనవంతుగా వారికి సహకారాన్ని అందిస్తోందని డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. బుధవారం స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయ కుమార్, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.



గుంతకల్లు: మాట్లాడుతున్న డీఆర్‌ఎం

వైసీపీ బకాయిలు చెల్లిస్తున్న కూటమి

కళ్యాణదుర్గం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులను కూటమి ప్రభుత్వం చెల్లిస్తోందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కంబదూరు మండలానికి సంబంధించిన గ్రామీణ ఉపాధి హామీ బిల్లులను చెక్కుల రూపంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. కంబదూరు మండలంలో 2014-19కు సంబంధించిన అనేక బిల్లులను వైసీపీ ప్రభుత్వం విత్‌హెల్డ్‌లో ఉంచిందని, కూటమి ప్రభుత్వం నేడు వాటికి మోక్షం కల్పించిందని అన్నారు.

కార్మికుడికి ఆర్థికసాయం

తాడిపత్రి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన హమాలీ సాగర్ ఇటీవల జరిగిన ప్రమాదంలో నడుము, కాళ్లకు గాయాలయ్యాయి. అతను అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని ఆపరేషన్‌కు అవసరమైన రూ.65,500లను నూర్ దూదేకుల సంఘం సభ్యులు అతని బుధవారం అందజేశారు. ఇందులో ఆ సంఘం ప్రెసిడెంట్ హుస్సేన్‌పీరా, సభ్యులు దస్తగిరి, మహబూబ్‌సాబ్, అలీ, సంజప్ప, హుస్సేన్‌పీరా తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాదర్బార్

పుట్లూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ గుత్తా శ్రీనివాసులునాయుడు బుధవారం తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొనివెళ్లి.. పరిష్కరించుకోవాలని కోరారు.



కలుగోడు, ఆయతపల్లిలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా హనుమద్ వ్రతం

బొమ్మనహాళ్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లులో ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం హనుమద్ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోషకుమార్‌చార్యులు, పవన్‌చార్యులు అభిషేకం, పవమానహోమం, వ్రతం నిర్వహించారు. స్వామి వారిని తులసి దళాలతో అలంకరించారు. ఇందులో ఆలయ ధర్మకర్త ఎస్టీ శ్రీనాథ్, దేవాదాయశాఖ అధికారి ఓబన్న, కమిటీ సభ్యులు హనుమంతరెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

● గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడులో ఆంజనేయస్వామికి వేకువజామున నుంచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. నందికోలాటాల మధ్య రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. టీడీపీ కన్వీనర్ కాలవ సన్నన్న, బీటీపీ ప్రాజెక్ట్ చైర్మన్ కాలవ నాగరాజు, సింగిల్ విండో అధ్యక్షులు నీరగంటి తిమ్మప్ప స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు.

● రాయదుర్గంరూరల్: మండలంలోని అయతపల్లిలో అంజనేయస్వామికి ఉదయాన్నే పంచామృతాభిషేకం, కుంకుమార్చన, అకుపూజ నిర్వహించారు. సాయంత్రం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

● యల్లనూరు : మండలంలోని చిలమకూరు ఆంజనేయస్వామి ఆలయంలో హనుమద్ వ్రతంలో భాగంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అన్నసంతర్పణం చేశారు.


నేమకల్లు : అలంకరణలో అంజన్న



చిలమకూరులో నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కసాపురం ఆలయంలో

అభివృద్ధి పనులకు శ్రీకారం


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బుధవారం భూమిపూజ చేశారు. రూ. 2.25 కోట్లతో రాతి విమాన గోపురం, గర్భాలయం, అర్ధ మండపం, రూ. 2.30 కోట్లతో దేవస్థాన ముఖ మండపం, రూ.2 కోట్లతో దేవాలయ శిఖరానికి బంగారు కలశం, రాతి ధ్వజ స్తంభం, రూ.1.50 కోట్లతో రాతి యాగశాల, రూ.35లక్షలతో ప్రసాదాల వంటశాల, అమ్మకపు కౌంటర్లు, రూ.20 లక్షలతో ఆలయం వెలుపల పరిపాలనా కార్యాలయం, ఆర్జిత సేవల బుకింగ్ కౌంటర్లు, రూ. 14.96 కోట్లతో వసతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యాలయంలో ఈఓ ఎం విజయరాజు, అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, ఏఈఓ వెంకటేశులు, ప్రధానార్చకుడు రాఘవాచార్యులు, దాతలు, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, తలారి మస్తానప్ప పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం..

వృద్ధురాలికి అందని పింఛన్


గౌరమ్మ

గుమ్మఘట్ట, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుగోడులో సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఓ వృద్ధురాలికి పింఛన్ అందకుండా పోయింది. అప్పారెడ్డిపల్లి గౌరమ్మ గత నెల అనంతపురం ఆస్పత్రిలో ఉండటంతో ఆమెకు పింఛన్ అందలేదు. ఈనెల ఆమె ఇంట్లోనే ఉన్నా సచివాలయ సిబ్బంది ఆమెకు పింఛన్ ఇవ్వలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు బుధవారం వెళ్లి సచివాలయ సిబ్బందిని అడగ్గా.. ఈ నెల కూడా సమయం అయిపోయిందని, వచ్చేనెల ఇస్తామని సమాధానమిచ్చారు. దీనిపై వారు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కేజీబీవీలో సమస్య పరిష్కారం


కేజీబీవీ ముందు మట్టి వేయిస్తున్న టీడీపీ నాయకులు

కణేకల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీచిక్కణ్ణేశ్వర చెరువు బ్యాక్ వాటర్ కేజీబీవీ ఆవరణంలోకి ప్రవేశిస్తుండటంతో విద్యార్థులు, సిబ్బంది ఇబ్బందులు పడేవారు. దీనిపై ఆంధ్రజ్యోతి బుధవారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన స్థానిక టీడీపీ నాయకులు తమ సొంత డబ్బుతో నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో మట్టి తోలించి సమస్యను పరిష్కరించారు. ఇందులో టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, చంద్రశేఖర్‌గుప్తా, బీటీ రమేష్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి బీజేపీలోకి చేరిక



బీజేపీలో చేరిన వైసీపీ నాయకులు

డీ.హీరేహాళ్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వైసీపీకి చెందిన ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర నాయకులు సుమారు 42 మంది బుధవారం బీజేపీలో చేరారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో వారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఇందులో ఎంపీపీ పవిత్ర వన్నూరుస్వామి, సర్పంచు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వ్యక్తికి దేహశుద్ధి

తాడిపత్రి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఆర్డీటీ కాలనీలో బుధవారం పిల్లలను అపహరించేందుకు వచ్చాడనే అనుమానంతో వెంకటరాముడు అనే వ్యక్తికి కాలనీవాసులు దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరం మండలం గొట్లూరు గ్రామానికి చెందిన వెంకటరాముడు, శోభారాణి దంపతులు కొంతకాలం క్రితం గొడవపడ్డారు. ఆ విషయమై శోభారాణి అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అతడిపై కేసునమోదు చేసి జైలుకు తరలించారు. అతడు గొట్లూరుకు వచ్చే సమయానికి భార్య శోభారాణి, కూతురు లేకపోవడంతో అడ్రస్ కనుగొని తాడిపత్రి సమీపంలోని ఆర్డీటీ కాలనీలో ఉన్నారని తెలుసుకొని ఇక్కడికి వచ్చాడు. వారిని వెతుకుతున్న సమయంలో పిల్లలు కనిపించడంతో చాక్లెట్లు ఇచ్చా డు. దీంతో అతడు పిల్లలను అపహరించేందుకు వచ్చాడని కాలనీవాసులు దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించారు. విచారణలో జరిగిన విషయం బయటకువచ్చింది. దంపతులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

డిప్యూటీ ఎంపీడీవోగా నందకుమార్



విడపనకల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండ ల సచివాలయ, వార్డుల డిప్యూటీ ఎంపీడీవోగా గుర్రం నంద కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీరాజ్‌లో సీనియర్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తూ, డిప్యుటేషన్‌పై రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వద్ద పీఏగా విధులు నిర్వహిస్తున్న నందకుమార్‌కు డిప్యూటీ ఎంపీడీవోగా ఉద్యోగోన్నతిపై ఇక్కడ బాధ్యతలు చేపట్టారు.

శెట్టూరుకు సరిత..



శెట్టూరు: మండల పరిషత్ కార్యాలయంలోని సీనియర్ సహాయకురాలు కే సరితకు డిప్యూటీ ఎంపీడీవోగా ఉద్యోగోన్నతి లభించింది. బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. పలువురు శుభాకాంక్షలు తెలిపారు.